# మట్టిలో మేధావులు

చంద్రశేఖరం మనసు వికలమైంది. ఇల్లు విడిచిన వేళ మంచిది కాదేమో అనుకున్నాడు. ఇలాంటి దృశ్యం ప్రత్యక్షంగా రెండోసారి చూడవలసి వచ్చింది. ఇది ముంబయిలో పేలుడు. ఎదురుగా కనిపిస్తున్నవి - రక్తపు మడుగులు, మాంసపుముద్దలు, చెదరిపడ్డ శరీర ఖండాలు, పగిలిన రైలు పెట్టెలు వినిపిస్తున్నవి హాహాకారాలు. ఈ హింసకు బలైపోయిన వారంతా అమాయకులు, సామాన్యులు. యుద్ధానికి సిద్ధమైన సైనికులు కారుకదా! ఇలాటి హింసకు ఏదో ప్రయోజనం ఉంటుందని ప్రోత్సాహం, ప్రతిష్ఠ కల్పించినదెవరు?

ఈ ప్రశ్నతో నిశ్చలమైన నీటిలో రాయి విసిరినట్లు అలలు అలలుగా జ్ఞాపకాలు రేగాయి. ఏనాడో తన సహపాఠి సింహాచలంపండా స్కూల్లో అన్నమాటలు చెవిలో రింగుమన్నాయి. 'కొత్త సామాజిక వ్యవస్థకు పునాదులు పడాలంటే పాత సారస్వతం, సంప్రదాయ వాసనలు పూర్తిగా కడిగి పెట్టాలి. సమాజం కూడా కొంత హింసను తట్టుకోడానికి సిద్ధపడాలి.' వయసుకి మించిన మేధావిలాగ గంభీరంగా మాట్లాడేవాడు. అడపాతడపా క్లాసులు ఎగగొట్టి తిరిగి నిస్సంకోచంగా దర్శనమిచ్చేవాడు.

సైన్స్ మాష్టారు ఎంతో బాగా హార్మనీ వాయించేవారు. శేఖరం తెలుగు, హిందీ పాటలు బాగాపాడతాడని పిలిచి పాడించేవారు. నాటకాలు వేయించేవారు.

ఆ ప్రోత్సాహం కారణంగానేమో బాల్య చాపల్యంతో ఎవ్వరికీ చెప్పకుండా ఇల్లు, ఊరు విడిచిపెట్టాడు శేఖరం. మేనత్త పెట్టెలోని డబ్బు జేబులో వేసుకొని ఒక మధ్యాహ్నం సికింద్రాబాద్ రైల్వే స్టేషనులోదిగి బరోసాయిచ్చిన పెద్దమనిషి కోసం ఇటూ అటూ తిరుగుతున్నాడు. అక్కడ సింహాచలం పండా ఎదురయ్యాడు. పడక పడక ఇప్పుడు వీడి కళ్లపడ్డానే అనుకొంటూవుంటే -

''నీతో చాలా రోజులై కొన్ని ముఖ్య విషయాలు మాట్లాడాలని అనుకొంటున్నాను'' అని చెయ్యి పట్టుకొని ఎదురుగా నిలబడ్డ ఫాస్ట్‌పాసింజర్ లోకి తీసుకుపోయాడు. అయితే ఉండు, మరి నేను టిక్కట్ కొని వస్తానని చెప్పి తప్పించుకోబోయాడు. ''మనం గుర్తించని ఈ వ్యవస్థా ఈ ప్రభుత్వం అమ్మే టిక్కెట్ కొనడమేమిటి నేనున్నానుగా'' అంటూ పండా ధైర్యం చెప్తూవుంటే రైలుబండి వేగంపుంజుకొంది. ఏదో స్టేషన్లో ఆగి తిరిగి కదలబోతూ వుంటే ''నేనిప్పుడే వస్తాను. ఈ కరపత్రాలు ప్రక్క బోగీలో ఉన్న స్నేహితుడికి ఇచ్చి వస్తా'' అంటూ పండా దిగి పరుగెత్తాడు.

శేఖరానికి తొలిసారి ఇల్లు విడిచి పెట్టడమే సాహసం. అందులో ఈ పరిణామం ఆందోళన కలిగిస్తోంది. పండా రాలేదు సరికదా అరగంట తర్వాత రైలుబండి ఎందుకో మధ్యలో ఆగింది. అందరూ హడావిడిగా దిగిపోతున్నారు. అర్థంకాక శేఖరం కూడా దిగిపోయాడు.

ఒక బోగీ- మంటల్లో ఉంది. 'కిటికీలు, తలుపులు బిగించి పోరలు నిప్పంటించిర్రు. ఆ బోగీ ప్రక్క పెట్టెలోంచి దూకి వచ్చిన ప్రయాణీకుడు గుండె బాదుకొంటున్నాడు. మండే బోగీలోని ప్రయాణీకులు నిలువునా ఉడికిపోతున్నారు. కాలే రెగ్జిన్ వాసనతో కలిసి కమురు కంపు కొడుతున్న పొగ మంటల్లోంచి ఆకాశంలోకి సుడులు తిరుగుతూ పోతోంది. ఇంతలో ఒక దృశ్యం శేఖం కంటపడింది. తెరిచివున్న ఒకే ఒక్క కిటికీలో కాలిన ఊసల మధ్య, నెలల పసికందు తల అంటుకుపోయి మిగిలిన శరీరం వ్రేలాడుతోంది. తాను చచ్చినా పసికందు బయటపడి అదృష్టం వుంటే బతకాలని ఏ బాలింతో విసిరే ప్రయత్నమై ఉంటుందని ఒక ముసలాయన కళ్లు ఒత్తుకొంటున్నాడు. అక్కడ నిలవలేక శేఖరం కదిలిపోయాడు. ఇక పండా కోసం చూడలేదు. అపరాధ భావంతో ఇక ఇంటికి పోయి మొహం ఎలా చూపాలని ఆలోచించి అంచలంచలుగా ముంబయి చేరుకున్నాడు. సినీ ప్రపంచంలో వెలిగి

పోవాలన్న చపలత్వంతో బయలుదేరి అందులో అడుగు మోపడానికి ఎన్ని కష్టాలు పడాలో ముంబయిలో అనుభవంతో తెలుసుకున్నాడు. గుంపులో గోవిందలాంటి ఎక్స్‌ట్రా పాత్రలతో వచ్చే ఆదాయం తన కడుపు నింపలేకపోతే ఇక ఎలా బ్రతకాలి అనే దశలో బట్టల మిల్లులో పనిచేస్తున్న ఒక ఫోల్డింగ్ మాష్టరు జాలిపడి తన మిల్లులో కార్మికుడుగా ఉద్యోగం ఇప్పించాడు. తొలి జీతం అందుకొని కడుపునిండా తిని కొంత డబ్బు మేనత్తకు పంపిన తర్వాత అపరాధ భావం కాస్త ఉపశమించింది. ఇల్లు విడిచినప్పుడు పసిపిల్లడి చాపల్యం అమాయకత్వం, కానీ ఇప్పుడు జీవితంలోని చీకటి - వెలుగులు చూసిన సర్వజ్ఞుడు శేఖరం.

ఇలా హృదయం పగిలే దృశ్యాలు రెండోసారి చూస్తూనే వేదాంతిలా అయిపోయాడు. రెండు సంఘటనల్లోను చిత్రహింస ఒక్కలాటిదే కానీ హింసావాదుల లక్ష్యాలు వేరు. ఒకరు వారు కోరుకున్న కొత్త వ్యవస్థకోనం హింసను సమర్థించుకొన్నారు. అదే ఆలోచనను ఇంకొకరు హైజాక్ చేసి, తమ మత ప్రతిష్ఠ కోసం, వ్యాప్తికోసం సమర్థించుకొంటున్నారేమో అనుకొన్నాడు. ముంబయి పేలుళ్లు చూశాక హింసను సహించలేక పోయాడు. చిన్న అగ్గిపెట్టెలాటి తన గూటికి పోయి మౌనంగా తలుపులు వేసుకు కూర్చొన్నాడు. ఆ పూట భోజనం మీదికే ధ్యాసపోలేదు.

ఈ హింసావాదులు తన ఊరి మామిడితోటలోని శివయ్యకున్నపాటి దయాదాక్షిణ్యాలు లేని వారా? - అనుకోగానే చిన్ననాటి సంఘటన కళ్లముందు కదలాడింది.

శేఖరం ఎనిమిదో క్లాసులో ఉన్నాడు. ఒక సాయంకాలం బడి విడిచిపెట్టాక హెడ్‌మాష్టారు నరసింహంగారి పెద్దకొడుకు విస్సు పిలిచాడు. ఇద్దరూ కలిసి బడి వెనుక రైలు పట్టాలు దాటి ఆవల ఉన్న మావిడి తోటలోకి చొరబడ్డారు. తోటను కౌలుకి తీసుకొని కాపుకాస్తున్న శివయ్య పనిపడి, తన చిన్న కొడుకును ఉంచి, ఇంటికి పోయాడు. ఇక ఇద్దరూ పలుకుబారిన కాయలు/ పండ్లు పులిసిపోయేదాకా తిన్నారు. కొమ్మమీంచి వేరొక కొమ్మకూ ఇంకో చెట్టుకూ దాటుతూ దూకుతూ ఎన్నో కసురు పిందెలు నేలకురాల్చేశారు. రెమ్మలు విరిచేశారు. శివయ్య వచ్చిన సద్దువిని పలాయన మంత్రం పఠించారు. శివయ్య ఇద్దరినీ చూడనేచూశాడు. రాలిపోయిన పిందెల్ని ఒక గంపలోకి ఎత్తి చీకటి పడ్డాక హెడ్‌మాష్టరు గారింటికి వచ్చి తన గోడు

వినిపించాడు. నరసింహంగారు అక్షరాలా ఉగ్రనృసింహావతారం ఎత్తి విస్సుని పిలిచారు. ఆ రెండో వెధవవెవడని అడిగారు. వారి ఇంటి వెనకనే పూరింట్లో ఉంటున్న శేఖరం వచ్చి నిలబడ్డాడు. బెత్తు పట్టుకొని ఇద్దరు పిల్లల అరచేతుల మీదా వీరవిహారం చేయించారు. అంతటితో అయిపోలేదు. అరచేతుల్ని తిప్పమని మండల మీద రక్తం చిందేలా కొడుతున్నారు. చూస్తున్న శివయ్య నిలవలేకపోయాడు. ఏడుస్తూ బెత్తాన్ని రెండుచేతులతో పట్టేసుకొన్నాడు.

"ఏటి బాబో ఇది? నేసూడనేకుండున్నాను. ఇట్టా సావగొడతావా? ఉంకోమారు తోటలోకి పోకుండా గట్టిగా సెపుతావనుకున్నా గానీ, ఇట్టా అనుకోనేదు. నాకూ పిల్లలున్నారు..." అనుకుంటూ కళ్లు తుడుచుకున్నాడు. వాడి గొంతులోని గాద్గదికతకు అంతటి హెడ్‌మాష్టారూ ఎంతో తప్పు చేసినట్లు నిలబడిపోయారు. "ఇగో ఈ పిందెలు అమ్మగోరికిస్తే ఉప్పూ, వగ్రగుండేసి ఏదన్నసేసుకొంతారు...." అని జంగిడిలోనివి నేల మీద పోసి చరచర వెళ్లిపోయాడు శివయ్య.

ఇలా ముంబాయిలో శేఖరం స్మృతి పథంలోకి వచ్చిన శివయ్య ఒక వేలుపులా కనిపించాడు. మరి ఈ హింసావాదులూ హంతకులా, పిశాచులా, రాక్షసులా ? అని తనలో అనుకొన్నాడు. ఇది వరకెన్నడూ పోనంత బలంగా ఇంటి దెసగా ధ్యాస మళ్లింది. ఫోల్డింగ్ మాష్టరు సలహా విని ఒక నెల శలవైతే పెట్టాడుకానీ ముంబయి అంటే వెగటు పుట్టింది. ఆ మాత్రం కాయకష్టం చేసుకొని అవసరమైతే నా ఊరిలో బతక లేకపోతానా- అనే ఆత్మ విశ్వాసంతో రైలు టిక్కెట్ కొనుక్కొన్నాడు.

వానలు విడవకుండా కురుస్తున్నాయి. శేఖరం శరీరం రైలు పెట్టెలో ఖైదీ అయిపోయినా మనసు స్వేచ్ఛగా రైలుకంటే ముందు ఉరకలేస్తోంది. ముంబయి అనుభవాలు అడుక్కిపోయి స్వంత ఊరులోని మనుష్యులే ఆలోచనల్లోకి వస్తున్నారు. ఏదో స్టేషనులో రైలు ఆగింది. ఎదురుగా ఉన్న ప్రయాణీకులు దిగి వారి స్థానంలో ఇద్దరు ఆడవాళ్ళు వచ్చి కూర్చొని తెలుగు మాటలు వినిపిస్తున్నారు. "లైటర్లూ గాసు పొయ్యిలూ వచ్చి మీరు బతికిపోయినారు. మా చిన్నతనంలో కట్టెల మీద వంట. ఇక వానలొస్తే కట్టెలు తడిసి మండవు. అగ్గిపుల్లలు చెమ్మపీల్చి వెలగవు..." అని ముసలామె మనవరాలితో చెప్తోంది.

ఒకనాటి సైన్స్‌మాష్టారి క్లాసు గుర్తొచ్చింది. స్కూలు పిల్లలకు నరసింహం మాష్టారంటే ఎంత భయమో సైన్స్ మాష్టారంటే అంత చనువు. యక్షప్రశ్నలు ఎవరు వేసినా ఆవేశపడక చిరునవ్వుతో సమాధాన పరచేవారు. సింహాచలపండా 'నిత్యాగ్ని హోత్రాలు, యజ్ఞాలు యాగాలు అంటూ ఖరీదైన నేతిని గుమ్మరించడం వివేకమా?' అని అడిగాడు ఒకరోజున. గత సంప్రదాయాల్ని విమర్శించడం పండాకి ఎంతో ఇష్టం.

''ఈనాటి ఆలోచనలూ విజ్ఞానంతో వేల సంవత్సరాల మానవుడి ప్రయత్నాల్నీ అలవాట్లనీ కొలవడం సరికాదు. ఒక యాంత్రపాలజిస్టులాగ సానుభూతితో చూడాలి. ఎండలకు అడవులు మండిపోతున్నప్పుడు పరిశీలించిన మానవుడు - నిప్పును పుట్టించి నియంత్రించుకోగలిస్తే రుచిగా ఆహారం వండుకోవచ్చు ఎముకలు కొరికే చలినుండి కాపాడుకోవచ్చు, జనావాసాల్లోకి క్రూరమృగాలు చొరబడకుండా రక్షించుకోవచ్చు అని తెలుసుకొని దర్భలు రాపాడించి నిప్పుచేసే ప్రయత్నం కొనసాగించాడు. ఏదో ఒక సమయంలో నిప్పుపుడితే చిదుగులు వెలిగించి అగ్నిదేవుడు ప్రసన్నమైనాడని సంతోషించేవాడు. ఆ నిప్పును ఆరిపోకుండా అన్ని ఋతువులకూ, ముఖ్యంగా వాన కాలంలో నిలుపుకోవాలంటే నెయ్యిలాంటి పదార్థం ఎంతో ఉపయోగపడింది. వేల సంవత్సరాల మాట అలావుండనీ, శ్రీకృష్ణదేవరాయలు కాలంలోనే గృహిణులు వానాకాలంలో నిప్పు దొరక్క ఎలాటి బాధలు పడేవారో ఒక కావ్యంలో వర్ణించాడు. ఇక పశుపాలన ఎరిగిన దశలో పాల ఉత్పత్తి అవసరాలకు మించిపోయేది. పాలు నిలువ ఉండే ఆహారం కాదు. వాటిని వ్యర్థంకాకుండా కాచి వెన్నతీసి నేతిరూపంలో ఉంచితే పాల విలువ ఎక్కువకాలం నిలిచేది. ఆరోజుల్లో నెయ్యి ఇప్పటిలా ఖరీదైన వస్తువుకాదు. వస్తు మార్పిడి రోజుల్లో పశువులే ధనం. అవి కొందరి దగ్గరే చేరిపోతే యజ్ఞయాగాల సందర్భంగా గోదానాల పేరుతో పంచే ప్రయత్నం చేసేవారు'' అని వివరించారు సైన్స్ మాష్టారు.

'ఇదంతా మీ ఊహాగానమేమో' అన్నాడు పండా ఊరుకోక. 'పోనీ నా ఊహే కావచ్చు. అయినా తర్కానికి నిలుస్తుంది కదా' అని నవ్వుతూ క్లాసు ముగించారు.

ఇలాంటి వెన్నెన్నో జ్ఞాపకాల వలయాల్లోపడి తిరుగాడుతూ ప్రయాణంలోని విసుగుదల మరచి మరుసటి సాయంకాలానికి ఇల్లు చేరుకొన్నాడు శేఖరం. ఏదో

ఆలోచిస్తూ శూన్యంలోకి చూస్తున్న అత్త శేఖరం గొంతు విని లేచి ఆశ్చర్యం, దుఃఖం కలగలిపి వెక్కి వెక్కి ఏడ్చింది. "నా రాత బాగులేక మీ నాయన ఇల్లు చేరాను. నిన్ను కన్న మూడు నెలలకే మీ అమ్మ కన్ను మూస్తే నిన్ను తలకెత్తుకొన్నాను. నీకు పదేళ్ళయినా నిండకుండా మీనాయన వెళ్ళిపోయాడు. నువ్వుకూడా నన్ను ఈ పాత కొంపలో ఒంటరిదాన్ని చేసి పోతావటరా?" అని దిగిమింగిన దుఃఖాన్నంత వెళ్ళగ్రక్కింది.

నే చేసింది క్షమించరాని నేరమే అత్తా! నా మాట నమ్ము. ఇక ముంబయి పోనుగాక పోను - అని అత్తను హత్తుకొని కన్నీళ్లతో కడిగివేశాడు. అలా కొంతసేపటికి ఇద్దరూ సమాధాన పడ్డాక - సైన్స్ మాష్టార్ని ఏ మొహం పెట్టుకొని చూడనే .... అని వాపోయాడు శేఖరం.

"ఇంకెక్కడి సైన్స్ మాష్టారు. ఏదో విషజ్వరమట. తగిలి వెళ్లిపోయారు" అని ఆకాశం వేపుకి చేతులెత్తింది అత్త. "కోడల్ని ఓదారుస్తూ ఆయనకు వచ్చిన పుత్రశోకాన్ని దిగమింగుతూ ఆ ఇంట జయరామయ్య మిగిలిపోయారు" అని వివరించింది. శేఖరం వెంటనే వెళ్లి వారిని పరామర్శించేవాడే కానీ అర్ధరాత్రయి పోయింది. గ్రామంలో వచ్చిన మార్పులు వింటూ- ముంబాయిలో ప్రేమ రాహిత్యంలో రోజులు గడిపిన తర్వాత, అత్తతో కష్టసుఖాలు చెప్పుకొని, మనిషికి మమతాను రాగాలు ఎంత అవసరమో' - అనుకొంటూ నిద్రపోయాడు.

మరునాడు ఉదయాన్నే జయరామయ్య గారిని చూడాలని బయలుదేరాడు. నున్నటి బట్టతల, తెల్లగా పండిన కనుబొమ్మలు భుజంమీద తుండుగుడ్డ - అదే రూపం. ఏ మార్పూలేదు. కానీ ఆ మొహంలో అలసట నీరసం. శేఖరాన్ని చూస్తూనే "చూశావా నాయనా! ఎక్కువ కాలం బతికితే ఎటువంటి కష్టాలు చూడాలో" అని కళ్లు గుడ్డతో ఒత్తుకొన్నారు జయరామయ్య. వచ్చి పీడించిన విషజ్వరం, కొడుకు పడ్డ బాధ వివరిస్తూ దుఃఖపడుతూవుంటే ఇక మాట మార్చే ప్రయత్నం చేశాడు శేఖరం. ఏదైనా రాస్తూ వుండండి తాతగారూ! మా తరానికి మీ రచనలతో అవసరం ఎంతైనా ఉంది - అన్నాడు. ఆ మాట వింటూనే ఏదో జ్ఞాపకం వచ్చినట్లు గోడకు వీపు ఆనించి అరుగుమీద నిటారుగా కూర్చొన్నారు.

"ఈ మధ్యనే ఎవడో నన్ను చూడవచ్చాడు. మీరు ఎప్పుడూ ఆత్మాశ్రయం

కథలు, మనసు కథలే రాస్తున్నారు మాష్టారూ! మా పత్రికకు కాస్త..... అంటూ నీళ్లు నమిలాడు. అంటే ఇక అలాటి కథలు రాయకండి, మా కొద్దనే కదా అర్థం.

వీళ్ల పిచ్చికూలా!

పువ్వు పిందెగా పరిణమించి ఫలిస్తుంది. ద్వైతంలోంచి అద్వైతం వికసిస్తుంది. ఆత్మాశ్రయ చింతనంలోంచే అవగాహన విస్తృతమై సమాజ శ్రేయస్సూ విశ్వశ్రేయస్సూ ఊహిస్తుంది. విశాలాకాశం లాటి రచయిత మనోవీధిలో విభజన రేఖలు గీసి హద్దులు పెట్టడం న్యాయమా?'' ఆవేశపడుతూ మాట్లాడారు. శేఖరం అనుభవాలు, రెండుసార్లు చూసిన దారుణ చిత్రహింసలూ విన్నాక, మనిషికీ మనిషికీ మధ్య మమతాను బంధం కరవైపోతోందనీ, ప్రాణానికి విలువ లేకుండా పోతొందనీ బాధపడ్డారు.

''నా ఆలోచనే మంచిది, నేను మెచ్చిన తత్త్వం నమ్మిన మతం గొప్పది అని అహం పెంచుకొన్నా అంతగా ప్రమాదం లేదుకానీ ఇక వేరే ఆలోచన, తత్త్వం, మతం వినరానివనీ వినపడకూడదనీ వాటి వాసనైనా ఉండరాదనీ అసహనం పెంచుకొంటే సరిగ్గా అందులోంచే హింసా ప్రవృత్తి కి బీజం పడుతుంది. మన మేధావులు విదేశీయమైన ఆలోచనల మీద పెంచుకొన్నంత మోజు మన సంస్కృతీ సారస్వతాల మీద లేనేలేదు కదా! ఎందుకో ఈ న్యూనతా భావం.

వేల సంవత్సరాల నాటి సంస్కృతిలోనూ సంప్రదాయాల్లోనూ, ఈనాటి చింతనకు సరిపడని అంశాలు కొన్ని ఉంటే ఉండవచ్చు. సహజమే. అంత మాత్రాన శాశ్వతమైనవీ, అందరికీ అన్ని కాలాలకూ హితమైనవీ జీవితపు విలువలుంటే వాటిని రక్షించుకోవద్దా పారేసుకొంటామా? ఏదో ప్రాతిపదికను వెతుక్కొని మనుషుల్ని ఎంతగా చీల్చి విడదీయ్యాలో అంతగా చీలుస్తున్నారు'' - అంటూ చెప్పుకు పోతూవుంటే జయరామయ్యగారి ధోరణికి దగ్గుతెర అడ్డువచ్చింది.

విశ్రాంతి తీసుకోండి తాతగారూ! నేను మళ్లీ వచ్చి కలుస్తాను- అని శేఖరం శెలవు తీసుకోబోయాడు. కానీ ''నేను చెప్పేది విను'' అంటూ కూర్చోబెట్టారు.

''ఎంతటి ఆర్థిక సామాజిక వ్యవస్థకు వ్యూహ రచన చేసినా పాలితులు పాలకులూ మానవ మాత్రులే అవుతారుకానీ మానవాతీతులు కారు కదా. అందుకే విద్య, వ్యక్తి వికాసం, నైతిక నిబద్ధతా సర్వదా సమాజానికి అవసరం అంటుంది

మన సంస్కృతి. మానవ నైజం వ్యవస్థ స్వరూపాన్ని మార్చే ప్రయత్నం చేస్తూనే ఉంటుంది. మంచిని పెంచడం చెడ్డను నిరోధించడం, నియంత్రించడం నిరంతరం అవసరమే. శాశ్వత పరిష్కారం అంటూ వుండదు....'' ఆయాస పడుతూ చెప్తున్నారు.

అర్థంచేసుకోలేని ఆ బరువైన ఆలోచనల్లోంచి శేఖరం మనసు విశ్రాంతి కోరింది. జయరామయ్యగారి దగ్గర శలవు తీసుకొని అలా అలా తను చదివిన స్కూలు వేపు వెళ్లాడు. ఆ వెనుకనే పచ్చని తోట కనపడగానే చిన్నతనపు రోజులు, తెలిసీ తెలియక చేసిన అల్లరి గుర్తొచ్చింది. తోటలోకి వెళ్లి నించున్నాడు. చెట్ల మధ్య నిలవగానే ఆ నీడలో ఏదో ప్రశాంతి మనసును ఆవరించింది.

శివయ్యా! గుర్తున్నానా? - అన్న పలకరింపు వినగానే తలపైకెత్తి అరచేతిని ఎండ వెలుగుకి అడ్డు పెట్టుకొని చూశాడు. ఆ శివయ్య మొహంలో ముదిమి నీడలు ముసిరినా రెండు కళ్లూ వింతగా ఆత్మానంద సూచికలుగా వెలుగుతున్నాయి.

''నువ్వెంత పెద్దోడివైతే ఏటి? మనూరి బాబుని నాను పోల్తిపట్టనంతావేటి?'' అని గలగల నవ్వాడు. అక్కడికి కాసింత దూరాన శివయ్య కొడుకు ఒక లేత మొలకను తవ్వి, ఉయ్యాలలో పసిబిడ్డను పాత్తి గుడ్డతో కలిపి తల్లి ఎత్తుకున్నంత నాజూకుగా తన చేతిలోకి తీసుకొన్నాడు. దాని వేళ్ల చుట్టూ అక్కడే తవ్విన మెత్తని మట్టిని ఉండగా చుట్టి, ఒక కుండలో ఆ మొలకను నిటారుగా నిలుపుతున్నాడు. శేఖరంతో మాట్లాడుతూనే, శివయ్య అటుగా వెళ్లి తన దోసిళ్ళతో మట్టిని కుండ అంచుదాకా పోసి నింపుతున్నాడు.

ఆ చిన్న మొక్కకు అంత కుండ అవసరమా? అని శేఖరం ఆశ్చర్యంగా అడిగాడు.

''మరొద్దంతావా బాబూ! పురిటి బిడ్డకి తల్లిపాలు ఎంత బలమో ఈ నేత మొక్కకి పుట్టిన మట్టి వోసన అంత బలం. ఆ వోసనుంటే ఇక సూతువు గదా. దాన్ని ఎక్కడేసినా మానై పోతాది.... '' అని వివరిస్తున్న శివయ్య మాటల్లో అనుభవం, ఆత్మానందం ధ్వనిస్తోంది.

మట్టిలో మేధావి, మనసున్న మేధావి శివయ్య అని తనలోనే అనుకొంటూ ఇంటిదారి పట్టాడు శేఖరం.

***